

మంగపేట : అకినేపల్లిమల్లారంలో తడిసిన వడ్ల బస్తాలు



వెంకటాపూర్ : వర్షానికి నేలవాలిన వరిపంటను చూపిస్తున్న రైతు

# పంటలను దెబ్బతీసిన మిగ్‌జాం

- తుఫానుతో నేలవాలిన వరి.. రాలిన మిర్చి
- చెట్లపైనే తడిసిన పత్తి బుగ్గలు
- వర్షం తగ్గినా.. నీటిలోనే పొలాలు
- పలు చోట్ల మొలకెత్తిన ధాన్యం
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఇబ్బందులు పడుతున్న రైతులు

మంగపేట, డిసెంబర్ 7 : మిగ్‌జాం తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని మిర్చి, వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మిరప తోటల్లో నీరు నిలవడం వల్ల కాపు దశలో ఉన్న చెట్లు చనిపోయే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షానికి ములుగు జిల్లా మంగపేట మండలంలోని కత్తిగూడెం శివారులో సాగు చేసిన మిర్చి తోటలోని కాయలు నేలరాలాయి. వర్షం వల్ల పొలాలన్నీ బురదమయం కావడంతో బస్తాల్లో నింపిన ధాన్యాన్ని రైతులు రోడ్ల పక్కన, మెరక ప్రదేశాల్లో నిల్వ చేసుకుంటున్నారు. గురువారం సాయంత్రం వరకు ఇంకా మబ్బులు కమ్ముకొని ఉండటంతో ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుకొని జాగ్రత్త పడుతున్నారు. మిరప తోటల్లో నీళ్లు నిలవడం వల్ల వర్షం తగ్గాక చెట్లు చనిపోవడం, తెగుళ్లు సోకడం జరుగుతుందని మిర్చి రైతులు తెలిపారు.

**పరిహారం అందించాలి**

మండలంలోని ఆయా గ్రామాల్లో తుఫానుకు దెబ్బతిన్న మిర్చి, వరి పంటల రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం అందించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మండల నాయకుడు డెక్క జయకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడుతూ మండలంలోని అకినేపల్లిమల్లారం, కత్తిగూడెం, దోమెడ, రాజుపేట, రమణక్కపేట, వాడగూడెం, చుంచుపల్లి, మల్లూరు, మంగపేట, కమలాపురం తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని, పంట నష్ట పోయిన రైతులను గుర్తించి నష్ట పరిహారం అందించాలన్నారు.



మహదేవపూర్ : మిర్చి పంటలో రాలిన పూత

**వెంకటాపూర్‌లో..**

వెంకటాపూర్ : తుఫాన్ ప్రభావంతో మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆగమవుతున్నారు. రెండు రోజులు మోస్తరు వర్షం పడగా గురువారం చిరుజల్లులు కురిశాయి. వరి పంట చేతికొచ్చే సమయంలో వాన పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పలువురు రైతులు వరి కోయగా వడ్లు తడవకుండా టార్పాలిన్లు, పరదాలు కప్పి కాపాడుకుంటున్నారు. వరి, పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తాయి. నాలుగు రోజులుగా ఎండ లేకపోవడంతో ధాన్యం నలుపెక్కుతున్నదని రైతులు వాపోతున్నారు.

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : తుఫాన్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 4,047 ఎకరాల్లో మిర్చి, 3,771 ఎకరాల్లో పత్తి, 5,417 ఎకరాల్లో వరి పంట సాగులో ఉండగా అకాల వర్షం ఆగం చేస్తున్నది. రైతులు ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే తుఫాన్ ప్రభావంతో అకాల వర్షం కురిసి మిర్చి, వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. మిర్చి పంటకు ఇప్పటికే ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ప్రస్తుత వర్షంతో కొత్త తెగుళ్లు సోకుతాయని రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలో వరి పంట కోత దశకు వచ్చింది. పలుచోట్ల వరి కోసి కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పారు. మండలంలో పత్తి పంట పలు చోట్ల కోత దశలో ఉండగా చెట్లపైనే బుగ్గలు తడిసిపోయాయి. దీంతో తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు కలత చెందుతున్నారు.

**మహాముత్తారంలో..**

మహాముత్తారం : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. వరి పంట కోతకు రావడంతో ప్రస్తుతం వీస్తున్న గాలుల మూలంగా నేలవాలి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి ఏరేందుకు సిద్ధంగా ఉందని, ప్రస్తుత వర్షాలతో నష్టం జరుగుతుందని తలలు బాదుకుంటున్నారు. కొన్ని చోట్ల వరి కోసి కుప్పపోసిన వడ్లు వర్షానికి మొలకేసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మహాముత్తారం : యామన్‌పల్లిలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలం

## ములుగు జిల్లాలో 5.8 మిల్లీ మీటర్ల వర్షపాతం

ములుగుటౌన్, డిసెంబర్ 7 : ములుగు జిల్లాలోని తొమ్మిది మండలాల్లో కలిపి గురువారం ఉదయం వరకు 5.8 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. వెంకటాపురం (నూగూరు)లో12.4, మంగపేటలో 10.4, తాడ్వాయిలో 8.8, వెంకటాపూర్‌లో 5.4, ఏటూరునాగారం, కన్నాయిగూడెంలో4.2, గోవిందరావుపేటలో 3.2, ములుగులో 2, వాజేడులో 1.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

**భూపాలపల్లి జిల్లాలో 4 మిల్లీ మీటర్లు..**

భూపాలపల్లి రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల వరకు 4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మహాముత్తారం మండలంలో 12.6 మిల్లీ మీటర్లు, పలిమెలలో 7.8, రేగొండలో 6.8, మహదేవ్‌పూర్‌లో 4.4, భూపాలపల్లిలో 3.6, గణపురంలో 2.4, టేకుమట్లలో 2.2, మొగుళ్లపల్లిలో 1.6, మల్హర్‌లో 1.4, కాటారంలో 1.2, చిట్యాల మండలంలో 1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వారు తెలిపారు.

## కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ



ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ప్యానెల్ సభ్యులు

కాటారం, డిసెంబర్ 7 : మండల కేంద్రంలోని కేజీబీవీని ప్యానల్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. టీం లీడర్ ఉమారాణి ఆధ్వర్యంలో 17 మంది సభ్యులు గురువారం పాఠశాలను సందర్శించి తరగతి గదులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. అలాగే కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి అన్నీ సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్ల సునీత, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఉమారాణి, కాటారం హై స్కూల్, గంగారం మోడల్ స్కూల్ బృందం, మల్హర్ కేజీబీవీ ప్రిన్సిపాల్ వెన్నెల పాల్గొన్నారు.

**ఆశ్రమ పాఠశాల సందర్శన**

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఆకులవారిఘనపూర్ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను గురువారం ప్రధానోపాధ్యాయురాలు బీ లక్ష్మి ఆధ్వర్యంలో అకడమిక్ ప్యానెల్ బృందం సందర్శించింది. ఎనిమిది మంది విషయ నిపుణులతో కూడిన బృందం అన్ని మొదలుకొని పాఠశాల కార్యక్రమాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఉపాధ్యాయుల బోధనాతీరును పరిశీలించి, పలు సూచనలు అందించింది. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా విద్యార్థులకు బోధన చేయాలని సూచించింది. కార్యక్రమంలో ప్యానల్ సభ్యులు రమేశ్, మధుకుమార్, అమలారెడ్డి, చంద్రకళ, సంపత్, లక్ష్మి, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్, పెద్దన్న, రేవతి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహదేవపూర్ : వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై భవానీ సేన్

## పోలీసుల ముమ్మర తనిఖీ

మహదేవపూర్, డిసెంబర్ 7 : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గురువారం మండలంలోని అంబట్‌పల్లి ప్రధాన రహదారిపై వాహనాలతో పాటు వాహనదారుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులు సంచరిస్తే సమాచారమివ్వాలని గ్రామస్తులకు సూచించారు. పోలీసులు ధనుంజయ్, కిషన్, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాపురం (నూగూరు)లో..**



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం (నూగూరు) : ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలోని ఆలుబాక గ్రామ సమీపంలో ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలో గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో బ్యాగులు తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల పూర్తి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధు

## బాధిత కుటుంబానికి జడ్పీ చైర్మన్ పరామర్శ

కాటారం, డిసెంబర్ 7 : మండలంలోని గుమ్మళ్లపల్లిలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం కాగా, గురువారం పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఘటనా స్థలాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన సోయం పద్మ-మల్లయ్యల ఇల్లు గ్యాస్ సిలిండర్ పేలి పూర్తిగా దగ్ధమై ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న పుట్ట మధు బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు.

## బాధితుడిని పరామర్శించిన జడ్పీటీసీ

చిట్యాల, డిసెంబర్ 7 : మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన పెండెల సమ్మయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ గొర్రె సాగర్ హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న సమ్మయ్యను గురువారం పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.

## కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

ఏటూరునాగారం, డిసెంబర్ 7 : మండలంలోని దొడ్ల వాగుపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు తుఫాను కారణంగా వచ్చిన వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని రాకపోకలకు అంతరాయం కలుగొద్దని వాగుపై రూ. 20 లక్షలతో యుద్ధప్రాతిపదికన డైవర్షన్ రోడ్డు నిర్మించారు. కాగా వర్షాల కారణంగా వచ్చిన వరదతో ఆ రోడ్డు కాస్త సగం వరకు కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు తెగిపోయిన డైవర్షన్ రోడ్డుకు మళ్లీ మరమ్మతులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



వరదకు దొడ్ల వాగు వద్ద కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

చిట్యాల, డిసెంబర్ 7 : మండలంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్ రజితను ఆదేశించారు. ఎత్తు, బరువును కొలిచి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా కోమల తదితరులు పాల్గొన్నారు.